సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



ఈదురు గాలులతో వర్షం
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల గురువారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. - 8లో



క్షణక్షణం.. భయం భయం
జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఇనుప స్తంభాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. - 9లో



బతుకమ్మ వేడుకలు
జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు కొనసాగాయి. మహిళలు బతుకమ్మ ఆడి ఉత్సాహంగా గడిపారు. - 9లో

న్యూస్‌రీల్

విచారణ వాయిదా

సాక్షి, యాదాద్రి : భూదాన్‌పోచంపల్లి మండలం అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల పరిధిలో గల పలు రసాయన పరిశ్రమలపై జరగాల్సిన విచారణ వాయిదా పడింది. సంబంధిత పరిశ్రమల యజమానులు గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో గల ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బోర్డు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఎదుట హాజరుకావాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అనివార్య కారణాల వల్ల విచారణ వాయిదా వేస్తూ పీసీబీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

రెండో రోజు 234 మంది అభ్యర్థులు హాజరు



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి : పట్టణంలోని వెన్నెల కళాశాలలో డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం రెండో రోజూ కొనసాగింది. 732 మంది అభ్యర్థులకు గాను 234 మంది హాజరయ్యారు. ఇందులో ఎస్‌జీటీ అభ్యర్థులు 132, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు 102 మంది ఉన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతు కె. జెండగే సందర్శించారు. డీఈఓ సత్యనారాయణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

తుర్కలషాపురం విద్యార్థికి గోల్డ్‌మెడల్



బంగారు పతకంతో శ్రీవసంత్

గుండాల : జాతీయ స్థాయి రన్నింగ్ పోటీల్లో గుండాల మండలంలోని తుర్కలషాపురం గ్రామానికి చెందిన శ్రీవసంత్ గోల్డ్‌మెడల్ సాధించాడు. కమ్మంపాటి సత్యనారాయణ, సంధ్యల కుమారుడు శ్రీవసంత్ ఉప్పల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా హర్యానాలో సెప్టెంబర్ 30న నిర్వహించిన జాతీయస్థాయి రన్నింగ్ పోటీల్లో శ్రీవసంత్ 100 మీటర్ల పరుగుపందెంలో పాల్గొని బంగారు పతకం సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

భువనగిరి టౌన్ : వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సీఎస్, డీజీపీతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు, డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనపై సమీక్షించారు. ధాన్యం చేతికొస్తున్నందున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఆర్డీఓలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ జగదీశ్‌కుమార్, పౌర సరఫరాల అధికారి వనజాత పాల్గొన్నారు.

• కొలువుదీరిన దుర్గామాత



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా యాదాద్రి కొండపై శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారసింహుడికి నిత్యారాధనలు



యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వయంభూ నారసింహుడికి సంప్రదాయ పూజలు వైభవంగా నిర్వహించారు. గురువారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవ, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న అర్చకులు

చౌటుప్పల్ ఆస్పత్రికి అవార్డులు



ఆస్పత్రికి అవార్డులు వచ్చిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బంది

చౌటుప్పల్ : 2023–24 సంవత్సరానికి గాను చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ కాయకల్పతో పాటు ఎన్‌క్యూఏఎస్ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ.కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. పచ్చదనం–పరిశుభ్రత, ల్యాబ్‌లో అనుసరిస్తున్న సురక్షిత విధానాలు, ఆస్పత్రి నిర్వహణ, బయో వేస్టేజ్, టాయిలెట్ల నిర్వహణకు గాను అవార్డులు దక్కాయి. ఆస్పత్రికి అవార్డులు దక్కడంతో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సమష్టి కృషితోనే అవార్డులు దక్కాయని సూపరింటెండెంట్ డాక్టర్ కె.అలివేలు తెలిపారు.

అన్నింటికీ ఒకే కార్డు

ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో 30 రకాల సేవలు

- పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామాలు, వార్డుల్లో మొదలైన సర్వే
- కుటుంబ వివరాలు సేకరిస్తున్న ప్రత్యేక బృందాలు
- 7వ తేదీ వరకు కొనసాగనున్న ప్రక్రియ



బీబీనగర్ మండలం మహాదేవపురంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : రేషన్, ఆరోగ్యం, ఇతర సంక్షేమ పథకాలన్నింటికీ ప్రతి కుటుంబానికి ఒకే డిజిటల్ కార్డు ఉండేలా ప్రభుత్వం కార్యాచరణకు పూనుకుంది. ఇందుకోసం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గురువారం సర్వే ప్రారంభించింది. సర్వే చేయడానికి ప్రత్యేకంగా నియమించిన బృందాలు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు సేకరిస్తున్నాయి. ఈనెల 7వ తేదీ వరకు సర్వే కొనసాగనుంది.

పైలెట్ ప్రాజెక్టు..	ఇళ్లు	జనాభా	సర్వే టీంలు
భువనగిరి 15వ వార్డు	290	1,400	03
యాదగిరిగుట్ట 8వ వార్డు	261	400	02
మహాదేవపురం	99	400	02
జంగంపల్లి	120	500	02

ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉద్దేశం ఇదీ..

ప్రజలు సులభంగా, తొందరగా రాష్ట్రంలో ఎక్కడైనా సేవలు పొందేందుకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు దోహదపడుతుంది. ఒక రాష్ట్రం.. ఒక కార్డు నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ కార్డు విధానాన్ని తీసుకువచ్చింది. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మరికొన్నింటిని కలిపి మొత్తం 30 రకాల సేవలను ఒకే గొడుగు కిందికి తేనుంది. ఆధార్ కార్డుల తరహాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేయనుంది. ప్రతి కుటుంబానికి ఒక ఐడీ నంబర్ ఉంటుంది. అలాగే కుటుంబంలోని సభ్యులకు వ్యక్తిగత నంబర్లు కూడా ఇస్తారు. ఈ కార్డులో కుటుంబంలోని ప్రతి సభ్యుడి హెల్త్ ప్రొఫైల్ సైతం నిక్షిప్తమై ఉంటుంది. తద్వారా ప్రభుత్వపరంగా ఎక్కడైనా వైద్య సేవలు పొందడానికి అవకాశం ఉంటుంది. కార్డు జారీ చేసిన అనంతరం ఏ సమయంలోనైనా మార్పులు, చేర్పులు చేసుకోవడానికి వీలు కల్పించనున్నారు.

పైలెట్ ప్రాజెక్టు గ్రామాలు, వార్డులు

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలెట్ ప్రాజెక్టుగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో 15వార్డు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో 8వ వార్డు, బీబీనగర్ మండలం మహాదేవపురం, యాదగిరిగుట్ట మండలం జంగంపల్లి గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయి. ఇక్కడ ప్రత్యేక బృందాలు గురువారం సర్వే ప్రారంభించాయి.

ఇంటింటి సర్వే సాగుతుంది ఇలా..

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో తహసీల్దార్, ఎంపీడీఓతో కలిపి నలుగురు సభ్యులు ఉన్నారు. ఈ బృందాలు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పంచాయతీలు, మున్సిపాలిటీలోని వార్డుల్లో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నాయి. కుటుంబంలోని వ్యక్తుల పేర్లు, జెండర్, పుట్టిన తేదీ, వయస్సు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, ఆధార్ నంబర్, అడ్రస్ వివరాలు నమోదు చేసుకుంటున్నాయి. వివరాలు సేకరించిన అనంతరం కుటుంబ సభ్యుల ఫొటోలు తీసుకుంటున్నాయి. ఆ సమయంలో కుటుంబంలో ఎవరైనా అందుబాటులో లేకపోతే ఐదు రోజుల్లో తిరిగి ఆ ఇంటికి వచ్చి ఫొటో తీసుకుంటారు. ప్రతి కుటుంబంలో మహిళ పేరును కుటుంబ పెద్దగా పరిగణిస్తారు. కలెక్టర్, ఉన్నతాధికారులు సర్వేను పర్యవేక్షిస్తున్నాం

సర్వే సమగ్రంగా చేపట్టాలి : కలెక్టర్

బీబీనగర్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను సమగ్రంగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. బీబీనగర్ మండలం మహాదేవపురంలో గురువారం ప్రత్యేక బృందం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను ఆయన పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి, కుటుంబంలోని ప్రతి సభ్యుడి వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రామాన్ని ఎంపిక చేసినందున ఏమరుపాటు వహించకుండా సర్వే చేయాలని ఆదేశించారు. పైలెట్ గ్రామాలు, వార్డుల్లో విజయవంతం అయ్యాక జిల్లా అంతటా అమలు చేయనున్నట్లు తెలిపారు. సర్వేలో తహసీల్దార్ శ్రీధర్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలతో ఎస్‌ఐలపై బదిలీ వేటు

- తాజాగా ఇద్దరు ఎస్‌ఐలు వీఆర్‌కు..
- హెడ్‌క్వార్టర్‌కు ఓ హోంగార్డు అటాచ్
- మల్టీజోన్–2 ఐజీ ఉత్తర్వులు జారీ
- పది రోజుల క్రితం వీఆర్‌కు ముగ్గురు ఎస్‌ఐలు
- మరో 9 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం

నల్లగొండ క్రైం: ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు ఎస్‌ఐలపై అవినీతి ఆరోపణలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు కొరడా ఝళిపించారు. పలువురు ఎస్‌ఐలను వీఆర్‌లో ఉంచగా.. మరికొంత మందిని ప్రాధాన్యత లేని స్థానాలకు పంపించారు. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన నల్లగొండ జిల్లా హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, వాడపల్లి ఎస్‌ఐ రవిని వీఆర్‌లో ఉంచుతూ మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కొండమల్లేపల్లి హోంగార్డు యాదగిరిని హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. అంతేకాకుండా వారం, పది రోజుల క్రితం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్ ఎస్‌ఐలను వీఆర్‌లో ఉంచారు. అడవిదేవులపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లి, చండూరు, మాడ్గులపల్లి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం ఎస్‌ఐలకు స్థాన చలనం కల్పించారు. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉండటంతో శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను కట్టడి చేయాలి..

రేషన్ బియ్యం అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైతే సంబంధిత పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఐజీ సత్యనారాయణ హెచ్చరించారు. ఇప్పటికే రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నిఘా వర్గాల నివేదిక, ఇతర సమాచారం ఆధారంగా పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సిమెంట్ పరిశ్రమను అడ్డుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్, పాల్గొన్న నాయకులు

రామన్నపేట : ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమించే అంబుజా సిమెంట్ పరిశ్రమను అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పిలుపునిచ్చారు.అంబుజ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును నిరసిస్తూ గురువారం రామన్నపేటలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రామన్నపేట ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. రూ.1,400 కోట్లతో ఏర్పాటు చేసే పరిశ్రమలో కేవలం 180మందికి మాత్రమే ఉపాధి దొరుకుతుందన్నారు. వాయు కాలుష్యం పెరిగి శ్వాసకోశ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ప్రజలను చైతన్య పరచాలని, పర్యావరణ వేత్తలతో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఉద్యమ కార్యాచరణ అమలుకు జెల్లెల పెంటయ్య, ఎండీ రేహాన్‌ను కోఆర్డినేటర్లుగా ఎన్నుకున్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, వివిధ పార్టీల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పల్లపు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శులు పోచబోయిన మల్లేశం, ఊట్కూరి నర్సింహ, బొడ్డుపల్లి వెంకటేశం, నకిరేకంటి నరేందర్, గూని రాజు, నకిరేకంటి గణేష్, బోగోజు గోవర్ధనాచారి, నాయకులు గోదాసు పృథ్వీరాజ్, అప్పం లక్ష్మీనర్సు, పున్న వెంకటేశం, ఎండీ జమీరొద్దిన్, బండ శ్రీనివాస్‌రెడ్డి, రాపోలు రాజశేఖర్, ఎండీ నాజర్, సాల్వేరు లింగం, ఫజల్‌బేగ్ పాల్గొన్నారు.

‘రీజినల్’ అలైన్‌మెంట్ మార్చాల్సిందే



హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు నిర్వహించిన ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపిన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితుల ఐక్య వేదిక, భూనిర్వాసితుల ఐక్య వేదిక యాదాద్రి సంయుక్తంగా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎవరూ ఆనందంగా లేరని, ఎవరిని కదిలించినా ఏదో ఒక దు:ఖంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కుటుంబాలతో సహా ధర్నా చేస్తున్నారంటే వారు ఎంత బాధలో ఉన్నారో అర్థం అవుతుందన్నారు. రైతులకు నష్టం జరగకుండా తక్షణమే అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. రైతులు చేసే పోరాటానికి మా సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

కొద్దిమంది అవసరాలకు అనుగుణంగా అలైన్‌మెంట్ ఉంది : జగదీష్‌రెడ్డి

గత ప్రభుత్వ ఆలోచనకు భిన్నంగా కొద్దిమంది అవసరాలకు అనుగుణంగా అలైన్‌మెంట్ మార్చే ప్రయత్నం జరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఆరోపించారు. అలైన్‌మెంట్ మార్చడం వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. చౌటుప్పల్‌లో రైతుల భూములతోపాటు చౌటుప్పల్ పట్టణాన్ని కూడా విడదీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మిగతా ప్రాంతాల్లో ఔటర్ రింగు రోడ్డు నుంచి 40 కి.మీ దూరం తీసుకున్న ప్రభుత్వం.. చౌటుప్పల్ ప్రాంతంలో మాత్రం 28 కి.మీ తీసుకోవడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం కూడా కంటితుడుపుగా ఉందన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డు రైతులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు తెగించి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, గాదరి కిశోర్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లె రవికుమార్, రైతు ఐక్య వేదిక నాయకులు చింతల దామోదర్‌రెడ్డి, కృష్ణ, నర్సింహ, శ్రీశైలం, సురేందర్‌రెడ్డి, మల్లేశం, రామలింగంగౌడ్, దబ్బేటి రాములు, భాగయ్య, నర్సిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకటేశం, పాండుయాదవ్, యాదయ్యగౌడ్, మాటూరి బాలరాజు, బూర్గు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ చేసి.. వదిలేశారు!

రైల్వే అండర్‌పాస్ కోసం రహదారి విస్తరణ

- 400 మీటర్ల వరకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ కప్పు తొలగింపు
- పనులు పూర్తిచేయడంలో జాప్యం
- నెల రోజులుగా నరకం చూస్తున్న పట్టణవాసులు, వ్యాపారులు



ఆలేరులోని జాతీయ రహదారి పక్కన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ కప్పు తొలగించిన దృశ్యం

ఆలేరురూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనుల్లో భాగంగా జాతీయ రహదారి పక్కన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ కప్పు తొలగించడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల సముదాయాలు, నివాస గృహాల ఎదుట మురుగు నిలిచి ఉండటంతో వాసన, దోమల బెడద భరించలేకపోతున్నారు. పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

రూ.1.60 కోట్లతో ప్రతిపాదనలు

ఆలేరు పట్టణంలో రైల్వే అండర్‌పాస్ నిర్మాణం కోసం ఇరువైపులా జాతీయ రహదారి విస్తరణ చేపట్టారు. ఇందులో భాగంగా రైల్వే గేట్ నుంచి పెద్ద వాగు వరకు 400 మీటర్ల వరకు రోడ్డు పక్కన ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీని ఆధునీకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆర్‌అండ్‌బీ అధికారులు అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.కోటి 60లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏడాది కావస్తున్నా నిధులు మంజూరు కాలేదు.

వానొస్తే నరకమే..

డ్రెయినేజీ నిత్యం రద్దీగా ఉండే రహదారి, దుకాణాల సముదాయాలున్న ప్రాంతంలో ఉండడం, నెల రోజులుగా పనులు పూర్తిచేయకపోవడంతో దుర్గంధం, దోమల బెడద భరించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రెయినేజీ కప్పు తొలగించడంతో ఇళ్లల్లోకి, దుకాణాలకు వెళ్లడానికి దారిలేకుండా పోయింది. రాకపోకలు సాగించేందుకు కొందరు డ్రెయినేజీ పైనుంచి చెక్కలు ఏర్పాటు చేసుకున్నారు. దారిలేకపోవడంతో కొనుగోలుదారులు రావడం లేదని, వ్యాపారపరంగా నష్టపోతున్నామని దుకాణదారులు వాపోతున్నారు. వర్షాలు కురిస్తే సమస్య మరింత జఠిలంగా ఉంటుంది.

వ్యాపారం దెబ్బతింటోంది



రోడ్డు విస్తరణలో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఆధునీకరణ పనులు చేపట్టారు. ఇందుకోసం డ్రెయినేజీ పైకప్పు పూర్తిగా తొలగించారు. దారి లేకపోవడంతో వినియోగదారులు రాక వ్యాపారం దెబ్బతింటుంది. అంతేకాకుండా దుర్వాసన, దోమలు వస్తున్నాయి. అధికారులు చొరవ చూపి త్వరగా పనులు పూర్తి చేయాలి. అప్పటి వరకు బ్లీచింగ్ చల్లి, ఫాగింగ్ చేయాలి.

– కుంటె నర్సయ్య, చికెన్‌షాప్ యజమాని

నామినేషన్లు పొందండి

మోత్కూరు: తెలంగాణ ఉద్యమకారుల కమిటీలను నియమిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కార్యాలయంలో నామినేషన్లు పొందాలని జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుడు దామరోజు వీరాచారి ఒక ప్రకటనలో కోరారు. నామినేషన్ పొందాలనుకున్న ఉద్యమకారులు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 6281830012ను సంప్రదించాలని కోరారు.

డీపీఆర్‌ఓగా అరుంధతి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసి నోట్ పుస్తకాలు అందజేస్తున్న నూతన డీపీఆర్‌ఓ అరుంధతి

భువనగిరిటౌన్ : జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్‌ఓ)గా యు.అరుంధతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కె.జెండగేను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థుల కోసం నోట్ పుస్తకాలు బహూకరించారు. అరుంధతి యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. డీపీఆర్‌ఓగా ఉన్న వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేయడంతో ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు ఆమె పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు.

క్లుప్తంగా

మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో దాడి

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన వ్యక్తిపై మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో అదే కాలనీకి చెందిన పలువురు దాడి చేశారు. గురువారం తిరుమలగిరి ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ కాలనీకి చెందిన పీట్ల పరశురాములు బుధవారం వేకువజామున బహిర్భూమికి వెళ్లి వస్తుండగా అదే కాలనీకి చెందిన వేముల యాదమ్మ, రాములు, శంకర్, రాజు కలిసి పరశురాములును స్తంభానికి కట్టేసి మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో దుర్భాషలాడారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పరశురాములు ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. త్వరలో బీసీ కాలనీలో మూఢనమ్మకాలపై పోలీసులచే కళాజాత కార్యక్రమం నిర్వహిస్తారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దేవరకొండ: పట్టణ శివారులోని దాబా వద్ద అందులో పనిచేసే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం కొమ్మేపల్లికి చెందిన అంకూరి బుచ్చయ్య (34) దేవరకొండ పట్టణ శివారులోని డిండి రోడ్డులో గల గ్రీన్ దాబాలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం దాబాలోని బాత్‌రూం సమీపంలో బుచ్చయ్య విగతజీవిగా పడిఉన్నాడు. ఇది గమనించిన అందులోనే పనిచేస్తున్న వర్కర్లు ముందుగా దాబా యజమానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్‌ఐ అజ్మీరా రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బుచ్చయ్య తలపై గాయాలు ఉండడంతో అతడిని ఎవరో కొట్టి చంపారని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడి అన్న నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

360 కిలోల బెల్లం, 20 కిలోల పటిక స్వాధీనం



పట్టుబడిన నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు జరిపిన దాడుల్లో 360 కిలోల బెల్లం, 20 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం కొత్తగూడెం తండాకు చెందిన గుగులోతు తులసీరాం తన ఆటోలో సుమారు 280 కిలోల బెల్లం, 10 కిలోల పటిక తరలిస్తుండగా.. దొండపాడు వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. బెల్లం, పటికతో పాటు ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అదేవిధంగా చింతలపాలెం మండలం ఎర్రకుంట తండాకు చెందిన ధరావత్ చంటి ద్విచక్ర వాహనంపై 80 కిలోల బెల్లం, 10 కిలోల పటికను తరలిస్తుండగా దొండపాడు వద్ద పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి బెల్లం, పటిక స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ దివ్య, సిబ్బంది రుక్మారెడ్డి, ధనుంజయ్, జయరాజ్, నవీన్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

- కూకటి వేళ్లతో సహా కూలిపోయిన మామిడి, నిమ్మ చెట్లు

మోత్కూరు : మోత్కూరు మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. పండ్ల తోటలు, వరి పైరు బాగా దెబ్బతిన్నాయి. దాచారం, అనాజిపురం, పాడిచేడు, పాటిమట్ల గ్రామాలలో మామిడి, నిమ్మ తోటలకు తీవ్రంగా నష్టం జరిగింది. సుమారు 100కు పైగా మామిడి చెట్లు, నిమ్మ చెట్లు వేళ్లతో సహా కూలిపోయాయి. ప్రధానంగా నిమ్మ చెట్లు వేర్లతో కూలిపోవడంతో భారీగా నిమ్మకాయలు నేల రాలాయి. దాచారం గ్రామంలో అండెం చిన్న పిచ్చిరెడ్డి రైతుకు చెందిన ఐదు ఎకరాలలోని నిమ్మ తోటలో భారీగా నిమ్మకాయలు నేల రాలాయి. అనాజిపురం గ్రామంలో రైతు కొల్లు శంకరయ్యకు చెందిన మామిడి తోట తీవ్రంగా దెబ్బ తిన్నది.

నేలకూలిన భారీ వృక్షాలు..

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో అన్ని గ్రామాల్లో చెరువులు అలుగు పోస్తున్నాయి. ప్రధానంగా నడిగూడెం నుంచి కాగితరామచంద్రాపురం, రత్నవరం నుంచి త్రిపురవరం గ్రామాలకు వెళ్లే రహదారి, చాకిరాల నుంచి రత్నవరంనకు వెళ్లే రోడ్డు, నడిగూడెం నుంచి కృష్ణానగర్‌కు వెళ్లే రహదారి, నడిగూడెం నుంచి బృందావనపురంనకు వెళ్లే రహదారుల వెంట ఉన్న భారీ వృక్షాలు నేలకూలాయి. ఆ సమయంలో అక్కడ ప్రజలెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నడిగూడెం ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ తన సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు.



మోత్కూరు: దాచారంలో కూలిపోయిన నిమ్మ చెట్లు



మోత్కూరు: అనాజిపురంలో నేలకొరిగిన మామిడి చెట్లు



నడిగూడెం: కాగితరామచంద్రాపురంనకు వెళ్లే రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు



నడిగూడెం: రత్నవరం గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

వరి పైరు నేలవాలింది



ఈదురు గాలులతో మామిడి చెట్లు వేర్లతో సహా కూలిపోయాయి. 30 ఏళ్లుగా కాస్తున్న మామిడి చెట్లు కూలి ధ్వంసమయ్యాయి. మూడు ఎకరాల్లో చేతికి వచ్చిన వరి పైరు నేల వాలింది.

– కొల్లు శంకరయ్య, రైతు, అనాజిపురం

రూ.లక్ష నష్టం జరిగింది



ఐదు ఎకరాల్లో నిమ్మ తోట ఉంది. ఎకరాకు వంద చెట్లు ఉండగా సుమారు 500 చెట్లకు సంబంధించి నిమ్మ కాయలు భారీ ఈదురు గాలులతో రాలి పోయాయి. 20 చెట్లకు పైగా వేర్లతో సహా కూలిపోయాయి. దీంతో సుమారు రూ. లక్ష వరకు నష్టం జరిగింది. మమ్ములను ప్రభుత్వం ఆదుకోవాలి.

– అండెం చిన్న పిచ్చిరెడ్డి, దాచారం

వేధింపులు తాళలేక యువకుడి బలవన్మరణం

- మూడురోజుల తర్వాత గుర్తించిన స్థానికులు



షేక్ సజ్జన్ (ఫైల్)

ఆత్మకూర్(ఎస్): ప్రేమించిన యువతి తరపు బంధువుల వేధింపులు తాళలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎస్) మండలం ఇస్తాలపురం గ్రామానికి చెందిన షేక్ ఖాజా, సుభాని దంపతుల కుమారుడు షేక్ సజ్జన్(24) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఖాజా గతంలోనే మృతిచెందగా.. సుభాని హైదరాబాద్‌లో ఉంటూ అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సజ్జన్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇస్తాలపురంలోనే ఉంటున్నాడు. సజ్జన్ చివ్వెంల మండలానికే చెందిన ముస్లిం యువతిని ప్రేమించాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ఈ విషయం యువతి కుటుంబ సభ్యులకు తెలియడంతో నాలుగు నెలల క్రితం సజ్జన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాటి నుంచి యువతి బంధువులు తనను బెదిరించడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్నట్లు సజ్జన్ తన స్నేహితులకు తెలిపాడు. దీంతో మనస్తాపానికి గురైన సజ్జన్ ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. గురువారం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు ఇంట్లోకి వెళ్లి చూడగా సజ్జన్ విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సజ్జన్ తల్లి సుభాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓ రత్నావత్ శంకర్ నాయక్ తెలిపారు.

ప్రేమించిన యువతి దక్కదేమోనని ఆత్మహత్య

- ఇంట్లో ఉరేసుకున్న యువకుడు



శ్రీకాంత్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: తాను ప్రేమించిన యువతి తల్లిదండ్రులు తమ పెళ్లికి ఒప్పుకోవడం లేదనే మనస్తాపంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం రాత్రి భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన చిలుక శ్రీకాంత్(22) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. శ్రీకాంత్ పోచంపల్లిలోనే ఉంటున్న తన మేనమామ కుమార్తెని కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. విషయం తెలిసి యువతి కుటుంబ సభ్యులు శ్రీకాంత్‌ను మందలించారు. తాను ప్రేమించిన అమ్మాయితో పెళ్లి జరగదని భావించిన శ్రీకాంత్ మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఎంగిలిపూల బతుకమ్మ పండుగ కావడంతో శ్రీకాంత్ తల్లి సక్కు బతుకమ్మ ఆడటానికి బయటకు వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీకాంత్ లోపలి నుంచి గొళ్లెం పెట్టుకొని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన సక్కు శ్రీకాంత్‌ను ఎంత పిలిచినా పలకలేదు. అనుమానం వచ్చి కిటికీలోంచి లోనికి చూడగా శ్రీకాంత్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఆమె రోదిస్తూ ఇరుగు పొరుగు వారి సహాయంతో శ్రీకాంత్‌ను కిందికి దించి స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న చిలుక శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీకాంత్ తండ్రి గతంలోనే అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి సక్కు కూలీ పనులు చేసి ఇద్దరు కుమారులను పెంచి పోషించింది. చేతికందొచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో అతడి తల్లి, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి



వెంకన్న (ఫైల్)

కేతేపల్లి: ఇనుప వైరుతో ఏర్పాటు చేసిన దండెంపై తడి కండువాను ఆరేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కేతేపల్లి మండలం కాసనగోడు గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసనగోడు గ్రామానికి చెందిన దండుగుల వెంకన్న (53) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వెంకన్న గురువారం కూలీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. స్నానం చేసిన అనంతరం తడిగా ఉన్న కండువాను ఇనుప వైరుతో ఏర్పాటు చేసిన దండెంపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కేతేపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హుజూర్‌నగర్‌కు ఐటీఐ మంజూరు

- భవన నిర్మాణానికి రూ.14.35 కోట్ల నిధులు విడుదల
- ఐదు కోర్సుల్లో 216 మందికి అవకాశం

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషితో హుజూర్‌నగర్‌కు పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) మంజూరయింది. నూతన ఐటీఐకి రూ.14.35 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఎం ఎంఎస్ నంబర్ 13 విడుదల చేసింది. నూతనంగా ఏర్పాటు చేయబోయే ఈ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్, డీజిల్ మెకానిక్ కోర్సులతోపాటు వెల్డర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తం ఐదు కోర్సుల్లో 216 మంది విద్యార్థులు పారిశ్రామిక శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. ఐటీఐకి ప్రిన్సిపాల్‌తో సహా 8 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాంత ప్రజలు ఎంతో కాలం నుంచి కోరుకుంటున్న ఐటీఐని మంజూరు చేయడంతోపాటు, శాశ్వత భవన నిర్మాణానికి రూ 14.35 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో తాను మంజూరు చేయించిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ)కు సమీపంలో రామస్వామి గుట్ట వద్ద కొత్తగా మంజూరైన ఐటీఐని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు.

భారత లునారస్ అంబాసిడర్‌గా మోహన సాయి



మోహన సాయి

హుజూర్‌నగర్: ప్రపంచ అంతరిక్ష వారం(వరల్డ్ స్పేస్ వీక్)ను పురస్కరించుకుని భారత దేశ లూనారస్ అంబాసిడర్‌గా హుజూర్‌నగర్‌కు చెందిన మోహన సాయి ఆకుల గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా మోహన సాయి మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన అనలాగ్ స్పేస్ మిషన్లలో ఒకటైన లునారస్ రీసెర్చ్ స్టేషన్ తరపున భారతదేశానికి అధికారిక లునారస్ అంబాసిడర్‌గా తనను నియమించినట్లు తెలిపారు. మోహన సాయి ప్రస్తుతం మహారాష్ట్రలోని అమిటీ యూనివర్సిటీలో మాస్టర్స్ ఆఫ్ ఆస్ట్రోబయాలజీ, స్పేస్ సైన్స్‌లో చివరి సంవత్సరం చదువుతున్నాడు. మన దేశ అంతరిక్ష లక్ష్యాలకు తోడ్పడడానికి ఎదురుచూస్తున్నానని మోహన సాయి పేర్కొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం సామ్యతండాకు వెళ్లే రోడ్డులో గురువారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చిన్నగంజం గ్రామానికి చెందిన షేక్ ఉస్మాన్ అలీ(37) మిర్యాలగూడ మండలం తుంగపాడు సమీపంలో గల సంగం డెయిరీ పరిశ్రమలో నీళ్ల ట్యాంకులు నిర్మించేందుకు వారం క్రితం కూలీగా వచ్చాడు. మరో నలుగురు వ్యక్తులతో కలిసి అక్కడే షెల్టర్‌లో ఉంటున్నాడు. బుధవారం ఉస్మాన్ అలీ ఇంటికి వెళ్తున్నానని తోటి కూలీలకు చెప్పి డెయిరీ పరిశ్రమ ప్రాంగణం నుంచి వెళ్లిపోయాడు. గురువారం అతడు సామ్యతండాకు వెళ్లే రోడ్డు సమీపంలో విగతజీవిగా పడి ఉన్నాడు. అతడి పక్కనే మద్యం బాటిళ్లు, చెప్పులున్నాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఉస్మాన్ అలీ మద్యం బానిస కావడంతో అతడి భార్య మెహ్రిన్ తన పిల్లలతో కలిసి గత రెండేళ్లుగా అతడికి దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు పైన పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం గట్టు పైన పార్కింగ్ స్థలం వద్ద వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన శానిటేషన్ సిబ్బంది ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డికి విషయం చెప్పారు. ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదని ఎస్‌ఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వర్క్‌షాప్‌లతో విద్యా ప్రమాణాలు మెరుగు

- కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ వెంకటయ్య

నల్లగొండ రూరల్: విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు వర్క్‌షాపులు ఉపయోగపడతాయని ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ వెంకటయ్య అన్నారు. గురువారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ప్రపంచంతో పోటీపడేలా తయారుచేయాలని, వారికి ఉన్నత భవిష్యత్ అందించేందుకు యూనివర్సిటీలు మార్గం చూపాలన్నారు. ప్రతి విద్యార్థి పరిశోధనా రంగంపై దృష్టిసారిస్తే విజ్ఞానవంతులుగా తయారవుతారన్నారు. పదవీ విరమణ చేసిన అధ్యాపకులు ఉన్నత విద్యాభ్యున్నతికి తమ అనుభవాలను జోడించేందుకు వీలుగా క్రిస్ప్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవి, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ సీఓఐ లక్ష్మీపతిరావు, అధ్యాపకులు అంజిరెడ్డి, డైరెక్టర్ రమేష్, ప్రశాంతి, నవీన్‌రెడ్డి, ఎంవీఎస్ రెడ్డి, సుధారాణి, అరుణప్రియ, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ వెంకటయ్య తదితరులు

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



యాదాద్రి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు



విష్వక్సేన పూజలో పాల్గొన్న ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి కొండపైనే అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అర్చకులు, పూజారులు వైభవంగా ప్రారంభించారు. ఆలయ ఆవరణలోని ఉప ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారి చెంత అర్చకులు, పూజారులు ఉదయం 11.45గంటలకు విష్ణ్వేశ్వర పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం స్వస్తీ వాచనం, రుత్విగ్వరణం, అఖండ దీపారాధన, అంకురారోపణం, మండపారాధన, కలశ స్థాపన, శ్రీదేవి పూజ, మూలమంత్ర జపం, సప్తశతీ, లలితా పారాయణం వంటి పూజలు చేశారు. సాయంత్రం 6.30గంటల నుంచి నవావరణ పూజ, చతుష్షష్ఠ్యుపచారయుక్త సహస్రనామార్చన, నీరాజన మంత్రపుష్పాలు చేపట్టారు. అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరిపి, దేవి త్రికాల పూజలను కొనసాగించారు. ఈ వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తే అధిక దిగుబడి



గడ్డిపల్లి కేవీకేలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్

నేరేడుచర్ల(గరిడేపల్లి): రైతులు సమగ్ర ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి ఎస్‌బీఐ మేనేజర్ ఎంకే సుకుమార్ అన్నారు. గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల పాటు జరిగే వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రసాయన ఎరువులు వాడటం వలన భూమి కలుషితమవుతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలన్నారు. అనంతరం వర్మీ కంపోస్ట్ తయారీ, జీవ ఎరువులు, తేనేటీగలు, కోడి పిల్లల పెంపకం, ఫిష్ కల్చర్ తదితర వాటిని సందర్శించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్, ఎ. కిరణ్, సీహెచ్. నరేష్, డాక్టర్ మాధురి, సుగంధి పాల్గొన్నారు.

నీలగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో మటన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టూటౌన్: మౌలిక సదుపాయాలతోపాటు, అన్ని రంగాల్లో నీలగిరిని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నీలగిరి పట్టణంలోని చంద్రగిరి విల్లాస్ వద్ద రూ.కోటితో నిర్మించిన బీటీ రోడ్డు, ముశంపల్లి రోడ్డు, ఏఆర్‌నగర్‌లో రూ.35 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రకాశంబజార్‌లో రూ.75 లక్షలతో నిర్మించిన మటన్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణంలో రూ.500 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ కాల్వ పనులు కొనసాగుతున్నాయని, రూ.400 కోట్లతో నీటి ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రూ.6 కోట్ల వ్యయంతో చంద్రగిరి విల్లాస్ నుంచి పిట్టంపల్లి వరకు సీసీ రోడ్డు పనుల కోసం టెండర్లు పిలిచామని, నెల రోజుల్లో పనులు మొదలు పెడతామని పేర్కొన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చంద్రగిరి విల్లాస్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు సూచించారు. బ్రాహ్మణవెల్లెంల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలోని చెరువులను కృష్ణా నీటితో నింపవచ్చని తెలిపారు. ఎంజీ యూనివర్సిటీ పక్కన రూ.25 కోట్లతో హరిత హోటల్‌ను నిర్మిస్తామన్నారు. పట్టణంలో స్లాటర్ హౌజ్ నిర్మాణానికి స్థలం గుర్తించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మటన్ వ్యాపారులకు దుకాణాలు సరిపోకుంటే మరో చోట స్థలం చూసి దుకాణాలు నిర్మించి ఇస్తామని చెప్పారు. అనంతరం మాన్యంచెల్క అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవన నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఈఈ రాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు కర్నాటి కరుణాకర్‌రెడ్డి, పున్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.

• అట్లాంటాలో పూల సంబరం



అమెరికా దేశంలోని అట్లాంటా నగరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మహిళలు మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మలను పేర్చి వారు నివాసముండే ప్రాంతంలో ఒకేచోటుకు చేరి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం మాజీ సర్పంచ్ ఇందుర్తి శశిరేఖ, సీతారాంరెడ్డి దంపతుల కుమార్తె హరిణి, తుడి సరిత, పుట్ట సునీత, లావణ్య, ఫణి తదితరులు పాల్గొన్నారు. – అర్వపల్లి

• జైపూర్‌లో బతుకమ్మ వేడుకలు



రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో గల నిమ్స్ యూనివర్సిటీలో చదువుతున్న నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థినులు బుధవారం రాత్రి ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడుతూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో మిర్యాల విష్ణువర్ధన్, బండి అశ్విని, తునికి వర్ధిని, అజార్, సందీప్, సుమంత్, సాన్విత్, సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. – చిట్యాల